క్లుప్తంగా

యోగా శిక్షణ శిబిరం ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుద్ధయోగా ఫౌండేషన్, విద్యాశాఖ, ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత యోగా వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతోంది. ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైన శిబిరం జూన్ మూడో తేదీ వరకు కొనసాగనుంది. ఉదయం ఆరు నుంచి ఏడు గంట వరకు, సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల వరకు శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. సమీప పాఠశాలల విద్యార్థులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని శిక్షకులు చిరంజీవి తెలిపారు.

బాధ్యతలు స్వీకరణ


తహసీల్దార్ రామారావు

గార: మండల తహసీల్దార్‌గా జెన్ని రామారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇదివరకు కొవ్వాడ తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉంది. అనంతరం రీసర్వేపై రెవెన్యూ సిబ్బందితో సమీక్ష జరిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులో ఉన్న ప్రశాంతి వృద్ధ జనాశ్రమంలో బెవర ముకుందరావు, జయలక్ష్మి దంపతుల ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు అన్నదాన కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ముకుందరావు ఎందరో నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారని గుర్తు చేసుకున్నారు. ఎక్కిరాల కృష్ణామాచార్యుల వద్ద శిష్యరికం చేసి హోమియో వైద్య, వేదం నేర్చుకున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం'

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజలను చైతన్యం చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావుతో కలిసి బుధవారం మాట్లాడారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పష్టమైన, నిర్దిష్టమైన సమాచారంతో చార్జ్‌షీట్ దాఖలు చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం బటన్ నొక్కడం ద్వారా సంక్షేమ పథకాల పేరుతో నవరత్నాలు అమలు చేస్తూ, ప్రజా అవసరాలను పక్కనపెట్టిందని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర ఈ లైబ్రరీ ప్రముఖ్ చల్లా వెంకటేశ్వరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీడీఆర్ గాంధీ, జిల్లా ఐటీ ప్రముఖ్ రావాడ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి పూజలు


అయ్యప్ప స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాత శ్రీకాకుళం ధర్మశాస్తా ఆలయంలో వేంచేసిన అయ్యప్పస్వామికి బుధవారం క్షీరాభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. అనంతరం స్వామిని అలంకరించారు.

ధర్మవరంలో పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: ధర్మవరం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు బుధవారం చేపట్టారు. సచివాలయ కార్యదర్శి ఎం.నారాయణమ్మ పర్యవేక్షణలో కాలువలు, వీధుల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తను తొలగించి శుభ్రం చేశారు.

వెండి ఆభరణాలు బహూకరణ


ఆభరణాల అలంకరణలో సీతారాముల విగ్రహాలు

పొందూరు: వీఆర్ గూడెం గ్రామంలోని రామాలయంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలకు రూ. 3 లక్షలు విలువైన వెండి కిరీటాలు, కవచాలను అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ తల్లిదండ్రులు ఆనందరావు, పద్మావతిలు బుధవారం సమర్పించారు. సువ్వారి క్రిష్ణవేణి జ్ఞాపకార్థం వీటిని అందించామన్నారు.

గొటివాడలో సత్యనారాయణ స్వామికి పూజలు


పూజలు చేస్తున్న అర్చకులు

జలుమూరు: గోటివాడ గ్రామంలో సత్యనారాయణస్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజైన బుధవారం స్థిర ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. అర్చకులు వివిధ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● హృదయపూర్వక స్వాగతం






భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లాకు చెందిన పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా బుధవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. సీఎంను కలిసిన వారిలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, తూర్పుకాపు, కళింగవైశ్య కార్పొరేషన్ల చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అందవరపు సూరిబాబు, రాష్ట్ర శిష్టకరణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయిక్ ఉన్నారు.

పెన్షనర్లు ఈకేవైసీ చేయించుకోవాలి

ఆమదాలవలస: పెన్షన్ పొందుతున్న రిటైర్డు ఉద్యోగులంతా ఈనెల ఆరో తేదీలోగా ఈకేవైసీని తప్పనిసరిగా పూర్తి చేయించుకోవాలని ఆమదాలవలస సబ్‌ట్రెజరీ అధికారి ఎస్.సువర్ణరాజు సూచించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆమదాలవలస సబ్‌ట్రెజరీ పరిధిలో 1130 మంది పెన్షనర్లకు 440 మంది మాత్రమే ఈకెవైసీ చేయించుకున్నారన్నారు. మిగిలినవారంతా త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, పీపీఓ ఆర్డర్ కాపీ, సీఎఫ్ఎంఎస్ నంబర్, మొబైల్ తీసుకొని ఎస్‌టీవో కార్యాలయం లేదా అందుబాటులో ఉన్న నెట్ సెంటర్లో ఈకేవైసీ చేయించుకోవాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.సిమ్మినాయుడు, బి.మోహన్‌రావు కూడా తెలియజేశారు. హెచ్ఈఆర్‌బీ యాప్ ద్వారా కూడా ఈకేవైసీ చేయించుకోవచ్చునన్నారు.

మండలానికి చేరిన జగనన్న విద్యాకానుక కిట్లు


విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

లావేరు: జగనన్న విద్యాకానుక నాలుగో విడత కిట్లు మండలానికి చేరుకున్నాయని ఎంఈవో ఎల్.ఈశ్వరరావు తెలిపారు. మండలానికి వచ్చిన కిట్లను ఎంఈవో బుధవారం పరిశీలించి లావేరులోని హైస్కూల్‌లో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరంలో జగనన్న విద్యాకానుక కిట్లను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. హెచ్ఎంల సమక్షంలో పాఠశాలలకు జగనన్న కిట్లను చేరుస్తామన్నారు. ఎంఈవో వెంట ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది ఉన్నారు.

నియామక పత్రాలు అందజేత


నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకులుగా ఎంపికైన వారికి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం నియామకపత్రాలను అందజేశారు. లావేరు మండలం బెజ్జిపురం-1 కేంద్రం సహాయకురాలుగా దాసరి ఆదిలక్ష్మి, జి.సిగడాం మండలం దేవరవలస పంచాయతీ ముంగంపేట కేంద్రం సహాయకురాలు సీహెచ్ మంగమ్మలు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు సక్రమంగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవోలు ఝాన్సీ, డి.పాపినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమరెడ్డి లక్ష్మణరావు, చివికి అసిరప్పడు, కిల్లారి సూర్యనారాయణ, అప్పలదాసు, ఇజ్జు సత్యారావు, ఢిల్లీశ్వరరావు ఉన్నారు.

ఇంటర్న్‌షిప్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఉన్నత విద్యలో ఇంటర్న్‌షిప్ వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని శ్రీకాకుళానికి చెందిన మోనిస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ పార్టనర్ శ్రీధర్ అన్నారు. ఎచ్చెర్లలోని వెంకటేశ్వరా కళాశాలల్లో ఇంటర్న్‌షిప్ ప్రాధాన్యంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్నత విద్యాశాఖ పీజీ కోర్సుల్లో ఇంటర్న్‌షిప్ తప్పని సరిచేస్తోందన్నారు. విద్యార్థులు పరిశ్రమల్లో నిబంధనల మేరకు 90 రోజుల దాటి పనిచేయటం వల్ల పరిశ్రమల నిర్వహణపై అవగాహన వస్తుందన్నారు. ఎంబీఏ విద్యార్థులు యువమేనేజర్లుగా, ఔత్సాహిక ప్రారిశ్రామిక వేత్తలుగా విజయవంతంగా ముందుకు సాగాలంటే క్షేత్రస్థాయి అవగాహన, విషయ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమన్నారు. ప్రతి విద్యార్థి ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా కోర్సుల్లో చేరాలని, చేరిన నుంచి పూర్తిస్థాయి విషయ పరిజ్ఞానానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ జి.గోవిందరాజులు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రమణమూర్తినాయుడు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ కె.సత్యం తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

● ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షుడు రమణ


మాట్లాడుతున్న ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షులు రమణ

రణస్థలం: రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని రణస్థలం రైతు సేవా సహకార సంఘం (ఎఫ్ఎస్‌సీఎస్) అధ్యక్షుడుగా నియమితులైన కిల్లారి రమణ అన్నారు. మండల కేంద్రంలోని ఎఫ్ఎస్‌సీఎస్ కార్యాలయ అవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆశీస్సులతో, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ చొరవతో అధ్యక్షులుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో అధ్యక్షులుగా పని చేసిన వారి సూచనలు, సలహాలతో సొసైటీ బ్యాంకును ముందుకు నడిపిస్తానన్నారు. ప్రభుత్వ పరంగా సక్రమించే ప్రతీ రుణ సదుపాయాన్ని రైతులందరికీ అందేలా చూస్తానని చెప్పారు. తొలుత రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం మాట్లాడుతూ.. బ్యాంక్ అభివృద్ధిలో భాగంగా కల్యాణ మండపం నిర్మిస్తే రణస్థలం, లావేరు మండల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సొసైటీ బ్యాంకుకు అద్దె రూపంలో ఆదాయం లభిస్తోందని చెప్పారు. అందుకు వచ్చే కమిటీ సమావేశంలో తీర్మానం చేసి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని సొసైటీ సభ్యులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ ఎండీ సీహెచ్ మార్కొండేయ స్వామి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పైడి శ్రీనివాసరావు, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, కరిమజ్జి భాస్కరరావు, పైడిభీమవరం పీఏసీఎస్ అధ్యక్షుడు గొర్లె తిరుపతినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు లంకలపల్లి ప్రసాద్, మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, గొర్లె అప్పలనర్సునాయుడు, మహంతి చినరామినాయుడు, దేశెట్టి తిరుపతిరావు, మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు గురాన మానస, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, సొసైటీ డైరెక్టర్లు ఉన్నారు.

నీలమణిదుర్గ ఉత్సవాలకు ఏర్పాట్లు


అమ్మవారి ఆలయం వద్ద అలంకరణ ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం కూడలిలో విద్యుత్ అలంకరణ కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి గుడి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా, ప్రధాన రహదారి కూడలిలో విద్యుత్ వెలుగులను ఏర్పాటు చేయనున్నారు.

● నేత్రపర్వం.. ఊయల ఉత్సవం




జిల్లా కేంద్రంలోని పీఎన్ కాలనీలో నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వార్షిక కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా స్వామి ఊయల ఉత్సవం బుధవారం నేత్రపర్వంగా సాగింది. ముందుగా శ్రీభూనీళా సమేత స్వామివారి ఉత్సమూర్తులను మండపానికి మేళతాళాలతో తీసుకొచ్చి ప్రత్యేకంగా రూపొందించిన ఊయల సింహాసనంపై ఉంచి పుష్పార్చనలు చేశారు. అర్చకుడు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో రకరకాల పుష్పాలతో అలంకరింపచేసి వేదమంత్రాల నడుమ స్వామికి సహస్రనామార్చనలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు కీర్తనలు ఆలపించగా, మరికొందరు కోలాట ప్రదర్శన చేశారు.

– శ్రీకాకుళం కల్చరల్

రైతులకు ఎరువుల పంపిణీ


ఎరువులను అందజేస్తున్న దృశ్యం

బూర్జ: మండల కేంద్రం బూర్జలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఎరువులను బుధవారం పంపిణీ చేశారు. రానున్న ఖరీఫ్ సీజన్ కోసం సమకూర్చిన ఎరువులను జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, స్థానిక సర్పంచ్ ఏగు అనురాధ ద్వారా చెరుకు రైతులకు సబ్సిడీపై ద్రవరూపంలో నానోయూరియా, డీఏపీ అందజేశారు. మండల వ్యవసాయ అధికారి వి.రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం 80 శాతం ఎరువులు ఆర్‌బీకేల ద్వారా, 20 శాతం ప్రైవేటు డీలర్లు, సొసైటీల ద్వారా అందించనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ సహాయకులు కె.వసంత పాల్గొన్నారు.

సమగ్ర సర్వేతో రైతులకు మేలు

పలాస: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూసర్వేతో రైతులకు మేలు జరుగుతుందని బొడ్డపాడు పంచాయతీ సర్పంచ్ తామాడ మదన్, ఎంపీటీసీ మద్దిల పాపారావులు అన్నారు. బొడ్డపాడు రెవెన్యూ పరిధిలోని భూముల సర్వేకు సంబంధించి డ్రోన్ కెమెరాను బుధవారం ప్రారంభించారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు.

పాఠ్య పుస్తకాలు సిద్ధం


పాఠ్యపుస్తకాలు పరిశీలిస్తున్న అధికారులు

రణస్థలం: మండలానికి మొదటి విడతగా 23,594 ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈవో ఎ.త్రినాథరావు చెప్పారు. మండల కేంద్రానికి చేరిన పుస్తకాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు రాగిజావ తాగేందుకు 8,700 గ్లాసులు కూడా మండలానికి చేరినట్టు పేర్కొన్నారు. మండలంలో ఉన్న 81 ప్రాథమిక, పది ఎంపీయూపీ, 15 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ, ఆదర్శ పాఠశాలు ఉన్నాయన్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు 2023-24 సంబంధించి పుస్తకాలను వేసవి సెలవుల తరువాత పాఠశాలలు తెరుచుకోగానే పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్ విజయ్, సీఆర్‌పీ శ్రీనివాస్ ఉన్నారు.

ముంచెత్తిన వాన


పాతపట్నంలో కురుస్తున్న వర్షం


ఆమదాలవలస: మున్సిపల్ కాంప్లెక్స్‌లో చేరిన వరద


ఆమదాలవలస: రైల్వేస్టేషన్ ఆవరణలో చేరిన వర్షపునీరు

● లోతట్టు ప్రాంతాలు జలమయం

పాతపట్నం: పాతపట్నం పరిసర గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అచ్చుతపురం, ప్రహరాజపాలెం, కొదూరు, గోపాలపురం, బూరగాం, గంగువాడ, కొరసవాడ తదితర గ్రామాల్లో కురిసిన వర్షంతో కొత కోచి ఎండలో ఆరబెట్టిన నువ్వు చేను, మొక్కజొన్న కండెలు తడిచిపోయాయి. వీటిని కాపాడుకోవడానికి రైతులు అవస్థలు పడ్డారు.

ఆమదాలవలస పట్టణంలో..

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలో సుమారు 40 నిమిషాలు పాటు భారీగా కురిసిన వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. అకాల వర్షంతో చిరువ్యాపారులు, పండ్ల దుకాణదారులు ఇక్కట్లు పడ్డారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ నుంచి ప్రయాణికుల రాకపోకలకు కాసేపు ఇబ్బంది కలిగింది. మున్సిపల్ కాంప్లెక్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, రైల్వేస్టేషన్ ఆవరణ వర్షం నీటితో నిండిపోయింది.

ఆమదాలవలస రూరల్: అల్పపీడన ద్రోణి ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. కొత్తవలస, నిమ్మతొర్లాడ, దూసి, తోటాడ, అక్కివరం, వంజంగి తదితర గ్రామాల్లో ఇటుక బట్టీల్లోకి వర్షపునీరు చేరింది. నువ్వు పంటకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఆమదాలవలస రూరల్: కురుస్తున్న వర్షం


ఆమదాలవలస రూరల్: జొన్నవలసలో నువ్వు పంటపై కప్పిన పరదాలు


ఆమదాలవలస రూరల్: దూసిలో ఇటుకలపై పరదాలు కప్పిన దృశ్యం

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు


సాంస్కృతిక నృత్యాల ప్రదర్శన

ఇచ్ఛాపురం: గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. బుధవారం స్వేచ్ఛా నృత్య తరంగిణి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారతీయ సంస్కృతీ సాంప్రదాయల మిళితమైన భరతనాట్యం, కూచిపూడి నాట్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


మురికి కాలువలో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని గరుడభద్ర సర్పంచ్ గూడ గిరిజ అన్నారు. గ్రామంలోని వీధుల్లో బుధవారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీల్లో ఉన్న చెత్తను తొలగించి, జేసీబీతో కాలువను తవ్వి మురుగు నీటిని బయటకు మళ్లించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. తడి, పొడి చెత్తను బయట పారబోయకుండా ఇచ్చిన చెత్త బుట్టలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గూడ ఈశ్వరరావు, బూత్ కన్వీనర్ సీహెచ్ రాకేష్, వై.జోగారావు, తులసీరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బైబిల్ ఎగ్జిబిషన్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పల్లివీధి జేఎస్ఎంబీ చర్చిలో ఈనెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు బైబిల్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు చర్చి ప్రతినిధి జీఎంఎస్ అనీల్‌రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.